
సాక్షి
జయశంకర్ భూపాలపల్లి
మంగళవారం । 8 । జూలై । 2025



ప్రాణహిత పరవళ్లు..
మహారాష్ట్రలో కురుస్తున్న వర్షాలతో కాళేశ్వరం వద్ద గోదావరితో కలిసి ప్రాణహిత నది వరద పరవళ్లు తొక్కుతోంది.
- 8లో▸



రైల్వే ఇన్‌చార్జ్ జీఎం తనిఖీ
కాజీపేట జంక్షన్‌లో సోమవారం దక్షిణ మధ్య రైల్వే ఇన్‌చార్జ్ జనరల్ మేనేజర్ సందీప్‌మథూర్ తనిఖీలు చేపట్టారు.
- 8లో▸

గరిష్టం/కనిష్టం
$29^0/23^0$

వాతావరణం
జిల్లాలో ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం సాధారణ పరిస్థితి ఉంటుంది. పలుచోట్ల మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

కనులపండువగా స్నాతకోత్సవం

- ముందుగా అకడమిక్ సెనెట్ సమావేశం
- పీహెచ్‌డీ అభ్యర్థులకు పట్టాలు.. మరికొందరికి గోల్డ్‌మెడల్స్ ప్రదానం
- రెండు విభాగాల వరకు సవ్యంగానే.. ఆ తరువాత గ్రూప్ ఫొటోలకే అవకాశం
- గవర్నర్‌తో సింగిల్‌గా ఫొటో దిగలేకపోయామన్న అసంతృప్తి..
- కాకతీయ యూనివర్సిటీలో పండుగ వాతావరణం



గవర్నర్ చేతులమీదుగా పట్టా అందుకుంటున్న దివ్యాంగుడు శివకృష్ణ



స్నాతకోత్సవంలో మాట్లాడుతున్న రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, వేదికపై హైదరాబాద్ ఐఐసీటీ డైరెక్టర్ డి.శ్రీనివాస్‌రెడ్డి, కేయూ వీసీ కె.ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ వి.రామచంద్రం, సెనెట్, పాలకమండలి సభ్యులు



రెండు గోల్డ్‌మెడల్స్ అందుకున్న కూతురును ముద్దాడుతున్న తల్లి

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ 23వ స్నాతకోత్సవం సోమవారం ఆడిటోరియంలో కనులపండువగా నిర్వహించారు. అభ్యర్థులు, వారి కుటుంబ సభ్యుల రాకతో యూనివర్సిటీలో పండుగ వాతావరణం నెలకొంది. రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ ఉదయం 11:30గంటలకు యూనివర్సిటీకి రాగా, ఆడిటోరియం వద్ద తొలుత ఎన్‌సీసీ కేడెట్స్‌తో గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఆడిటోరియంలో అకడమిక్ సెనెట్ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఆరేళ్లకు సంబంధించి అన్ని కోర్సుల ఫలితాలను అప్రూవ్ చేస్తూ వాల్యూమ్స్‌పై సంతకం చేశారు. సెనెట్ సభ్యులతో గ్రూప్‌ఫొటో దిగారు. అనంతరం గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, ముఖ్యఅతిథి అయిన హైదరాబాద్ ఐఐసీటీ డైరెక్టర్ డి.శ్రీనివాస్‌రెడ్డి, కేయూ వీసీ కె.ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ వి.రామచంద్రం, సెనెట్, పాలకమండలి సభ్యులతో కలిసి ఆడిటోరియంలోని వేదిక వద్దకు వచ్చారు. స్నాతకోత్సవాన్ని షెడ్యూల్ ప్రకారం నిర్వహించారు.

ఫార్మసీలో కొందరికి ఇచ్చాక హడావుడి..
కాకతీయ యూనివర్సిటీ 2020–2025 వరకు ఆర్ట్స్, సైన్స్, సోషల్ సైన్స్, ఫార్మసీ, ఇంజనీరింగ్, లా విభాగాల్లో పీహెచ్‌డీలు అవార్డులు 387మందికి 374 మంది అభ్యర్థులు హాజరయ్యా రు. కొందరు గవర్నర్ చేతులమీదుగా తీసుకోగా, మరికొందరు గ్రూప్‌గా నలుగురైదుగురిని నిలబెట్టి ఫొటో దిగేలా చేయడంతో అభ్యర్థులు ఆవేదన చెందారు. తొలుత ఆర్ట్స్, సైన్స్ విభాగాల అభ్యర్థులకు పట్టాలందించారు. కొందరు ఫార్మసీ పీహెచ్‌డీ అభ్యర్థులకు ప్రదానం చేయగానే, సమయం తక్కువగా ఉందని, త్వరత్వరగా పూర్తిచేయాలని గవర్నర్ సెక్యూరిటీ సిబ్బంది.. డీస్‌కు పక్కకు తీసుకెళ్లి చెప్పారు. దీంతో నలుగురైదుగురు ఒకేసారి పట్టాలు తీసుకొని అక్కడికి వచ్చి గవర్నర్, వీసీ పక్కన నిలబడి ఫొటోలు దిగేలా చేశారు. గవర్నర్‌తో పట్టా తీసుకొని ఫొటో దిగాలనుకున్నామన్న కోరిక నెరవేరకుండా పోయిందని పలువురు అభ్యర్థులు అసంతృప్తి వ్యక్తం చేశారు.

అభ్యర్థుల తల్లిదండ్రులకు భారీస్క్రీన్..
అభ్యర్థుల తల్లిదండ్రులను ఆడిటోరియంలోకి అనుమతించలేదు. ఆడిటోరియం ఎదుట ఏర్పాటుచేసిన భారీ స్క్రీన్‌లో ఈ కార్యక్రమాన్ని తిలకించారు. పిల్లలు పట్టాలు, బంగారు పతకాలు తీసుకోవడం చూసి సంతోషంవ్యక్తం చేశారు. కాగా, యూనివర్సిటీలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. స్నాతకోత్సవం ముగిశాక పీహెచ్‌డీ పట్టాలు, గోల్డ్‌మెడల్స్ పొందిన అభ్యర్థులు తమతమ కుటుంబసభ్యులు, స్నేహితులతో గ్రూప్ ఫొటోలు దిగారు. మరికొందరు పట్టా పట్టుకుని సెల్ఫీలు తీసుకుని సంతోషంలో మునిగిపోయారు.

బంగారు పతకాలు..
పీహెచ్‌డీ అభ్యర్థులు ముగియగానే కేయూ మహిళా ఇంజనీరింగ్ కాలేజీలోని వివిధ విభాగాల్లో గోల్డ్‌మెడల్స్ సాధించిన అభ్యర్థులు (వీరికి కాలేజీలోనే బంగారు పతకాలు ఇచ్చారు) తమ గోల్డ్‌మెడల్స్ తీసుకొని వేదిక పైకి బ్యాచ్‌లవారీగా, విభాగాల వారీగా రాగా, గవర్నర్ వారితో గ్రూప్ ఫొటోలు దిగారు. 373మంది అభ్యర్థులకు 564 గోల్డ్ మెడల్స్ ప్రదానం చేయాల్సి ఉండగా 446 బంగారు పతకాలు అందజేశారు.

విలువలు, నైపుణ్యాలు రెండూ అవసరమే
స్నాతకోత్సవంలో రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ
- వివరాలు 8లో▸

పట్టాలు, బంగారు పతకాలు అందుకున్న విద్యార్థులు
- మరిన్ని ఫొటోలు 8లో▸

న్యూస్‌రీల్

సబ్‌కలెక్టర్ ఆకస్మిక తనిఖీ



కాళేశ్వరం: మహదేవపూర్ మండలంలో కాటారం సబ్‌కలెక్టర్ మయాంక్‌సింగ్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రభుత్వ సామాజిక ఆస్పత్రిని పరిశీలించి వైద్యులతో మాట్లాడారు. మెడికల్ సిబ్బంది, ఎమ్మార్సీ ఉద్యోగుల రిజిస్టర్లను తనిఖీ చేశారు. కాళేశ్వరంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్‌ను చూశారు. అక్కడి మౌలిక సదుపాయాలు, విద్యార్థుల హాజరు, గతేడాది ఎస్సెస్సీ ఫలితాలపై ఎంఈఓలను అడిగి తెలుసుకున్నారు. కాళేశ్వరంలోని సర్వే నంబర్ 129లో నూతన బస్టాండ్ నిర్మాణం కోసం స్థలాన్ని పరిశీలించారు. ఆయన వెంట డిప్యూటీ తహసీల్దార్ కృష్ణ ఉన్నారు.

నవోదయ ప్రవేశాల దరఖాస్తుల స్వీకరణ

భూపాలపలి అర్బన్: నవోదయ విద్యాలయాల్లో 6వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కలెక్టర్ రాహుల్‌శర్మ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో అడ్మిషన్ల వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. 6వ తరగతి 2026–27 విద్యా సంవత్సరానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు చెప్పారు. ఈ నెల 29వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. డిసెంబర్ 13వ తేదీన అర్హత ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. వివరాలకు 91107 82213, 79932 63431 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం



భూపాలపల్లి అర్బన్: ప్రజా సమస్యలను వెలికితీసి వాటిని పరిష్కరించే విధంగా సీపీఐ నాయకులు పనిచేయాలని పార్టీ జిల్లా కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం జరిగిన సీపీఐ భూపాలపల్లి మండల నాలుగవ మహాసభ కుడుదుల వెంకటేష్ ఆధ్వర్యంలో నిర్వహించగా రాజ్‌కుమార్ మాట్లాడారు. పార్టీ కార్యకర్తలు అలుపెరగకుండా ప్రజల కోసం పని చేయాలని కొనియాడారు. పార్టీ అభివృద్ధి కోసం కార్యకర్తలు పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు సతీష్, వైకుంఠం, రాజయ్య, బాబు, రాజయ్య, రజిత, పవన్‌కల్యాణ్, రమేష్ పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి

భూపాలపల్లి అర్బన్: ఈ నెల 9న సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శులు క్యాతరాజ్ సతీష్, చెన్నూరి రమేష్ కోరారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఏఐటీయూసీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఏకపక్షంగా తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లు కార్మిక హక్కులను కాలరాసే విధంగా ఉన్నాయన్నారు. వాటిని వెంటనే రద్దు చేసి పాత హక్కులను అమలు చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు శ్రీకాంత్ పవన్, రాజయ్య పాల్గొన్నారు.

నంబర్ ప్లేట్లు మార్చాల్సిందే

పాత వాహనాలకు హై సెక్యూరిటీ నంబర్ ప్లేట్
- 2019కి ముందు కొన్న వాటికి తప్పనిసరి
- ఇప్పటికే ఉత్తర్వులు జారీచేసిన రవాణా శాఖ
- సెప్టెంబర్ 30వరకు గడువు





భూపాలపల్లి అర్బన్: రహదారి భద్రతపై సుప్రీం కోర్టు తీర్పును అనుసరించి అన్ని రకాల వాహనాలకు హై సెక్యూరిటీ రిజిస్ట్రేషన్ నంబరు ప్లేట్ (హెచ్ఎస్ఆర్‌ఎన్పీ) తప్పనిసరి చేస్తూ రవాణా శాఖ ఉత్తర్వులు జారీచేసింది. ఈ నంబరు ప్లేట్ చివరన ఉన్న లేజర్ కోడ్‌ను ట్రాక్ చేసి వాహనదారుడి పేరు, వివరాలు, వాహనం ధ్వంసమైనా లేజర్ కోడ్ ద్వారా వివరాలు తెలుసుకునే అవకాశం ఉంటుంది. 2019 ఏప్రిల్ ఒకటి కన్నా ముందు కొనుగోలు చేసిన వాహనాలకు ఈ నంబరు ప్లేటు బిగించని పక్షంలో రోడ్లపైకి వచ్చే అవకాశం ఉండదు. సెప్టెంబర్ 30లోగా అమర్చుకోవాలని రవాణా శాఖ స్పష్టం చేసింది. లేనిపక్షంలో భారీ జరిమానాలు, శిక్ష విధించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఈ నంబరు ప్లేట్లు అమర్చుకునేందుకు వాహనాల తీరు ఆధారంగా ప్రత్యేక రుసుములు ప్రకటించారు.

కాలంచెల్లిన వాహనాల కట్టడి..
కాలపరిమితి ముగిసిన వాహనాలు రోడ్లపై తిరగకుండా రవాణా శాఖ పటిష్ఠ చర్యలు తీసుకుంటుంది. ఇందులో భాగంగా 15ఏళ్ల కాలపరిమితి ముగిసిన వాహనాలను గుర్తించే ప్రక్రియ చేపట్టింది. కాలపరిమితి ముగిసిన వాహనాలు వేర్వేరు నంబరు ప్లేట్లతో రోడ్లపై తిరుగుతూ ప్రమాదాలకు కారణమవుతున్నాయి. అనేక వాహనాలకు సకాలంలో సామర్థ్య పరీక్షలు చేయించడం లేదు. ఇకపై అలాంటి వాటికి అడ్డుకట్ట పడనుంది. జిల్లా వ్యాప్తంగా 2019 మార్చి 31లోగా రిజిస్ట్రేషన్ చేసుకున్న వాహనాలు సుమారు 50వేల వరకు ఉండగా ఇందులో అన్ని రకాల పాత వాహనాలు అంటే కాల పరిమితి ముగిసినవి మినహా మిగతా వాటికి హై సెక్యూరిటీ నంబరు ప్లేట్లు బిగించుకోవాల్సిందేనని అధికారులు స్పష్టంచేశారు. 2019 ఏప్రిల్ తర్వాత వాహనాలకు ఇప్పటికే హైసెక్యూరిటీ నంబరు ప్లేటు నిబంధన అమలవుతోంది. ఇప్పటివరకు హై సెక్యూరిటీ రిజిస్ట్రేషన్ నంబర్ ప్లేట్ బిగించుకున్న వాహనాలు 20వేల వరకు ఉన్నాయి. ఇందులో చాలా వాహనాలు సాధారణ నంబర్ ప్లేట్‌తో తిరుగుతున్నాయి. ప్లేట్ బిగించని వాహనాలను అమ్మాలన్నా.. కొనాలన్నా ఇబ్బందులు తప్పేలా లేవు. ఆర్టీఏ అధికారుల తనిఖీల్లో పట్టుబడితే కేసులు నమోదు చేసి జరిమానా వేయడం, వాహనం సీజ్ చేయనున్నారు.

మార్పు ఇలా..
పాత వాహనానికి కొత్తగా హై సెక్యూరిటీ నంబర్ ప్లేటు పొందాలంటే వాహనదారుడే నేరుగా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలి. http://bookmyhsrp.com వెబ్‌సైట్‌లో వాహనం నంబరు, వాహనం రకం, కంపెనీ, జిల్లా తదితర వివరాలు నమోదు చేయాలి. నంబర్ ప్లేట్ షోరూం వివరాలు వస్తాయి. వెంటనే ఆ షోరూంకు వెళ్లి వాహనానికి హై సెక్యూరిటీ నంబర్ ప్లేట్ అమర్చుకుని ఫొటో తీసి మరోసారి వెబ్‌సైట్‌లో నమోదు చేయాల్సిన బాధ్యత వాహనదారుడిపై ఉంది. ఈ విధానంతో నిరక్షరాస్యులు, స్మార్ట్‌ఫోన్లు లేని వాహనదారులు అయోమయానికి గురికానున్నారు.

రుసుము (రూ.లలో) ఇలా..

ద్విచక్ర వాహనాలు	300–350
త్రిచక్ర వాహనాలు	350–450
కార్లు	550–700
కమర్షియల్ వాహనాలు	600–800

విధిగా అమర్చుకోవాలి..



పాత వాహనాలకు కొత్తగా హై సెక్యూరిటీ నంబర్ ప్లేట్లు విధిగా అమర్చుకోవాల్సిందే. ప్రభుత్వం విడుదల చేసిన ఉత్తర్వుల మేరకు నిర్ణయించిన ఫీజుతో నంబర్ ప్లేట్ తీసుకోవాల్సి ఉంటుంది. రోడ్లపై తిరిగే ప్రతీ వాహనం హై సెక్యూరిటీ రిజిస్ట్రేషన్ నంబర్ ప్లేట్ అమర్చుకోవాలి. తనిఖీలో పట్టుబడితే కేసులు నమోదు చేసి వాహనాలు సీజ్ చేస్తాం. అవసరమైతే బీమా, రిజిస్ట్రేషన్ తదితర సేవలు నిలిపివేసేలా రవాణా శాఖ చర్యలు చేపడుతోంది.
- సందాని, డీటీఓ, భూపాలపల్లి

ఎమ్మెల్యే సార్.. జరదేఖో

పరిష్కారం కాని చిట్యాల సివిల్ ఆస్పత్రి సమస్యలు



అభివృద్ధికి నోచుకోని చిట్యాల సివిల్ ఆస్పత్రి

- అమలుకు నోచుకోని ఎమ్మెల్యే గండ్ర హామీలు
- ఎమ్మెల్యే సమీక్ష చేసినా ఫలితం శూన్యం
- వైద్యుల్లేక రోగులకు తప్పని తిప్పలు



నిరుపయోగంగా పిల్లల బరువు కొలిచే యంత్రం

చిట్యాల: పూర్తిస్థాయిలో వైద్యుల్లేక పది నెలలుగా చిట్యాల సివిల్ ఆస్పత్రిలో రోగులు పడుతున్న ఇబ్బందులు ఇప్పటికీ తప్పడం లేదు. వైద్యులను నియమించి రోగులకు పూర్తిస్థాయిలో వైద్యసేవలు అందుబాటులోకి తీసుకొస్తామని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ఆస్పత్రిలో రెండు నెలల క్రితం సమీక్ష నిర్వహించి హామీ ఇచ్చినప్పటికీ ఇప్పటి వరకు సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదు. దీంతో ఇబ్బందులు తప్పడం లేదు. సార్ మా ఆస్పత్రి మారలే.. అంటున్నారు.

సమీక్షించి.. వదిలేశారు..
ఆస్పత్రిలో సమస్యలపై ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు మే 12వ తేదీన ఆస్పత్రిలో వైద్యులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఆస్పత్రిలో సమస్యలు, వైద్యుల కొరత తదితర అంశాలను తెలుసుకున్నారు. త్వరితగతిన సమస్యలను పరిష్కరించి వైద్యులను నియమిస్తామని సమీక్ష సందర్భంగా ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కానీ ఇప్పటి వరకు ఒక్క సమస్య కూడా పరిష్కారానికి నోచుకోలేదు. ఆస్పత్రిలో గైనకాలజిస్టులు లేకపోవడంతో ఆపరేషన్ల కోసం వాడే పరికరాలు అన్నీ పదినెలలుగా మూలకు పడ్డాయి. ఆస్పత్రిలో వెంటిలేటర్ లేకపోవడంతో అత్యవసర పరిస్థితుల్లో వచ్చే రోగులను ఎంజీఎంకు రెఫర్ చేయాల్సిన దుస్థితి నెలకొంది. ఇప్పటికైనా ఎమ్మెల్యే దృష్టి సారించి మూడు మండలాలకు పెద్దదిక్కుగా ఉన్న ఆస్పత్రిలోని సమస్యలను పరిష్కరించడంతో పాటు వైద్యులను నియమించాలని పలువురు కోరుతున్నారు.

వైద్యుల కొరత..
చిట్యాల సివిల్ ఆస్పత్రి చిట్యాల, టేకుమట్ల, మొగుళ్లపల్లి మండలాల ప్రజలకు పెద్దదిక్కుగా ఉంది. పది నెలలుగా గైనకాలజిస్ట్, పిల్లల వైద్యులు లేకపోవడంతో సేవలు అందడం లేదు. పది నెలలుగా గర్భిణులకు వైద్యసేవలు అందడం లేదు. నార్మల్ డెలివరీలు, ఆపరేషన్లు ఆస్పత్రిలో చేయడం లేదు. గర్భిణులను భూపాలపల్లి జిల్లా ఆస్పత్రి, వరంగల్ ఎంజీఎం ఆస్పత్రులకు రెఫర్ చేస్తున్నారు. దీంతో దూరం వెళ్లడానికి గర్భిణులు, కుటుంబసభ్యులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

కాంగ్రెస్ ఇన్‌చార్జ్‌గా అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

- సంస్థాగత నిర్మాణంపై పార్టీ దృష్టి
- వీరి ఆధ్వర్యంలో గ్రామ, మండల, జిల్లా కమిటీలు!



అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

సాక్షిప్రతినిధి, వరంగల్: సంస్థాగత నిర్మాణం, స్థానిక సంస్థల ఎన్నికలపై కాంగ్రెస్ పార్టీ అధిష్టానం దృష్టి సారించింది. గ్రామ స్థాయి నుంచి జిల్లా వరకు పార్టీని మరింత బలోపేతం చేయడంపై కసరత్తు చేస్తోంది. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే ఇటీవలి పర్యటన తర్వాత ఆ పార్టీ హైకమాండ్ దూకుడు పెంచింది. ఇప్పటికే పార్లమెంట్ నియోజకవర్గాలకు నియమించిన అధిష్టానం.. సోమవారం ఉమ్మడి జిల్లాలకు ఇన్‌చార్జ్‌లను నియమించింది. ఈక్రమంలో ఉమ్మడి వరంగల్‌కు పార్టీ ఇన్‌చార్జ్‌గా ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను నియమించారు. జగిత్యాల జిల్లా ధర్మపురి నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన లక్ష్మణ్‌కుమార్ గతంలో ఉమ్మడి కరీంనగర్ జెడ్పీ చైర్మన్‌గా.. 2023లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ విప్‌గా నియమితులయ్యారు. ఇటీవల జరిగిన మంత్రివర్గ విస్తరణలో ఆయనకు చోటు దక్కగా, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమశాఖను కేటాయించారు. నల్లగొండ ఇన్‌చార్జ్ మంత్రిగా కూడా ఉన్న లక్ష్మణ్‌కు ఉమ్మడి వరంగల్ పార్టీ ఇన్‌చార్జ్‌గా నియమితులయ్యారు. ఉమ్మడి వరంగల్‌లో నెలకొన్న ఇటీవల నెలకొన్న గ్రూపు రాజకీయాల నేపథ్యంలో పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ ఆదేశాల మేరకు టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్‌కుమార్ సోమవారం లక్ష్మణ్‌కుమార్‌ను నియమిస్తున్నట్లు ప్రకటించారు. కాగా.. మరో రెండు నెలల్లో స్థానిక సంస్థల ఎన్నికల ఘట్టం మొదలవనుండగా.. సమర్థంగా ఎదుర్కొనేందుకు సంస్థాగత కమిటీలు పూర్తి చేసేందుకు అన్ని స్థాయిల్లో కసరత్తు జరుగుతున్నట్లు చెబుతున్నారు. ఈక్రమంలోనే ఉమ్మడి జిల్లాల వారీగా ఇన్‌చార్జ్‌లను నియమించిన అధిష్టానం.. స్థానిక సంస్థల ఎన్నికలకు ముందే వీరి ఆధ్వర్యంలో జిల్లా ఇన్‌చార్జ్ మంత్రులు, ఎమ్మెల్యేల సమన్వయంతో గ్రామ, మండల, జిల్లా కమిటీలను పూర్తి చేసే బాధ్యతలను అప్పగించినట్లు పార్టీవర్గాల్లో చర్చ జరుగుతోంది.

ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు చర్యలు

కలెక్టర్ రాహుల్ శర్మ



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్ శర్మ

భూపాలపల్లి: ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడీఓసీ కార్యాలయ సమావేశపు హాల్‌లో రెవెన్యూ, టీజీఎండీసీ, ఇరిగేషన్, పోలీస్, రవాణా, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, భూగర్భజల శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఉచితంగా ఇసుకను అందిస్తున్నట్లు తెలిపారు. ఉచిత ఇసుక రవాణాలో అక్రమాలకు తావులేకుండా అధికారులు పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలోని ఇసుక రీచ్‌లను గుర్తించి జియో ట్యాగింగ్ చేయాలన్నారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ఇసుక రీచ్‌ల అనుమతుల కోసం నివేదికలు అందించాలని చెప్పారు. అనంతరం 'మన ఇసుక వాహనం' మొబైల్ యాప్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌ను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి అవకాశాలు..
మహిళల ఆర్థికాభివృద్ధి సాధనకు ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ రాహుల్ శర్మ పేర్కొన్నారు. సోమవారం భూపాలపల్లి పట్టణంలోని సుభాష్‌కాలనీ సమ్మక్క సారక్క జిల్లా మహిళా సమాఖ్య, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళా శక్తి సంబరాల కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మహిళల అభివృద్ధికి ఫిష్ ఔట్‌లెట్, మహిళా శక్తి, బస్సులు, సౌరశక్తి ప్లాంట్ల ద్వారా విద్యుత్ సరఫరా, పెట్రోల్ బంకులు, వ్యవసాయ పనిముట్లు, పాఠశాలల విద్యార్థులకు యూనిఫామ్స్ తయారీ, అమ్మ ఆదర్శ పాఠశాలల మరమ్మతులు మొదలగు కార్యక్రమాలను మహిళా సంఘాల ద్వారా అమలు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డీఆర్‌డీఓ బాలకృష్ణ, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించాలి..
ప్రజావాణిలో వచ్చిన పెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ రాహుల్ శర్మ జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడీఓసీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 63మంది నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న అన్ని ప్రజావాణి దరఖాస్తులతో పాటు ప్రజాభవన్, హైదరాబాద్ నుంచి వచ్చిన దరఖాస్తులు వచ్చే సోమవారంలోపు పరిష్కరించి నివేదికలు అందజేయాలని అధికారులను ఆదేశించారు.

విచారణలో జాప్యం జరగొద్దు



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ

భూపాలపల్లి: కేసుల విచారణలో జాప్యం చేయకుండా వీలైనంత త్వరగా పరిష్కరించాలని ఎస్పీ కిరణ్ ఖరే పోలీసు అధికారులకు సూచించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దివస్‌లో భాగంగా ఎస్పీ 18మంది బాధితుల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. ప్రజలు నిర్భయంగా మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా, పైరవీలు చేయకుండా, స్వచ్ఛందంగా పోలీసు సేవలను వినియోగించుకుంటూ వారి సమస్యలను చట్ట ప్రకారం పరిష్కరించుకోవాలని సూచించారు.

మూడు నదులకు మూడు హారతులు



కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని త్రివేణి సంగమం సరస్వతీ ఘాటు వద్ద మూడు హారతుల కార్యక్రమాన్ని ఆలయ అర్చకులు ఘనంగా నిర్వహించారు. సోమవారం సాయంత్రం సంగమం వద్ద వరద నీటితో పరవళ్లు తొక్కుతుండగా హారతితో పరవశించింది. సరస్వతీనది పుష్కరాలు ముగిసినప్పటి నుంచి దేవాదాయశాఖ నిత్య హారతి కార్యక్రమాన్ని నిర్వహిస్తుంది.

నిట్‌లో గవర్నర్‌కు ఘన స్వాగతం



గవర్నర్‌కు స్వాగతం పలుకుతున్న కలెక్టర్ స్నేహశబరీశ్

కాజీపేట అర్బన్ : కేయూ స్నాతకోత్సవం సందర్భంగా సోమవారం నగరానికి విచ్చేసిన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ.. నిట్ వరంగల్‌లో పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, వరంగల్, హనుమకొండ కలెక్టర్లు సత్యశారద, స్నేహ శబరీశ్, మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, సీపీ సన్‌ప్రీత్‌సింగ్, ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి, 'కుడా' చైర్మన్ వెంకట్రామ్‌రెడ్డి, అడిషనల్ కలెక్టర్ వెంకట్‌రెడ్డి పూల మొక్క అందజేసి గవర్నర్‌కు ఘన స్వాగతం పలికారు.

విద్యార్థి సంఘాల బాధ్యుల ముందస్తు అరెస్ట్

కేయూ క్యాంపస్: కేయూ స్నాతకోత్సవం నేపథ్యంలో సోమవారం తెల్లవారు జామున వివిధ విద్యార్థి సంఘాల బాధ్యులు 13 మందిని పోలీసులు ముందుస్తు అరెస్ట్ చేశారు. మధ్యాహ్నం 1.30 గంటలకు స్నాతకోత్సవం ముగిసిన అనంతరం గెస్ట్‌హౌజ్‌లో గవర్నర్ లంచ్ చేశారు. మధ్యాహ్నం 2 గంటలకు పోలీస్ అధికారులు ఆయా విద్యార్థి సంఘాల బాధ్యులను గవర్నర్ వద్దకు తీసుకెళ్లారు. ఈ సందర్భంగా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్‌కు కేయూ భూములు కేటాయించొద్దని విన్నవించి వినతిపత్రం సమర్పించారు. అలాగే, యూనివర్సిటీకి సంబంధించిన పలు సమస్యలను కూడా పరిష్కరించాలని ఆ వినతిపత్రంలో కోరారు.





జాతీయ గీతం ఆలపిస్తున్న పట్టభద్రులు, కుటుంబ సభ్యులు, వారి బంధువులు



పీహెచ్‌డీ పట్టాలు అందుకున్న అభ్యర్థులు

విలువలు, నైపుణ్యాలు రెండూ అవసరమే

రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ | కనులపండువగా కేయూ స్నాతకోత్సవం

కేయూ క్యాంపస్: విలువలు, నైపుణ్యాలు రెండు అవసరమేనని, వృత్తిపర విజయానికి విలువలతో కూడిన జీవితంపై విద్యార్థులు దృష్టిసారించాలని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ అన్నారు. సోమవారం కాకతీయ యూనివర్సిటీ ఆడిటోరియంలో నిర్వహించిన కేయూ 23వ స్నాతకోత్సవంలో గవర్నర్.. చాన్స్‌లర్‌గా పాల్గొని మాట్లాడారు. డాక్టర్ ఏపీజే అబ్దుల్‌కలాం మాటలను గుర్తుచేస్తూ విజయం కోసం కష్టాలు అవసరం అన్నారు. వైఫల్యాలకు భయపడకుండా దానిలోని విజయం కోసం బీజాలు పండించాలన్నారు. మనిషి జీవితంలో ఇబ్బందులు వస్తుంటాయన్నారు. ఎందుకంటే ఆ విజయాన్ని ఆస్వాదించేందుకు ఇబ్బందులు అవసరమన్నారు. వైఫ్యలానికి భయపడొద్దన్నారు. వైఫల్యాన్ని ఆలింగనం చేసుకోండి.. దానినుంచి నేర్చుకోండి.. ప్రతి అడ్డంకికి మీ మెట్టు మారనివ్వండి అన్నారు. 21వ శతాబ్దానికి నైపుణ్యాలు అవసరమన్నారు. విమర్శనాత్మక ఆలోచనలు, సృజనాత్మకత, సహకారం ఉత్సుకత, కమ్యూనికేషన్ వంటి ఐదు 'సీ'లను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. యువత విజయానికి అవే మార్గదర్శకాలన్నారు. కాకతీయ యూనివర్సిటీ యాభై సంవత్సరాల క్రితం స్థాపించినప్పుడు ఇది ఉత్తర తెలంగాణకు ఉన్నత విద్యలో రూపాంతర ప్రయాణానికి నాందిపలికిందన్నారు. 672 ఎకరాల్లో విస్తరించి ఉందన్నారు. 27 విభాగాలతో 500కుపైగా కళాశాలలను కలిగి ఉందన్నారు. విశ్వవిద్యాలయం విస్తృత విద్యావ్యవస్థగా ఎదిగిందన్నారు. 2023 కేయూ న్యాక్ ఏ ప్లస్ గ్రేడ్ సాధించిందన్నారు. 2024లో ఎన్ఐఆర్ఎఫ్‌లో 151–200 ర్యాంకు సాధించిందన్నారు. ఫార్మాస్యూటికల్ సైన్సెస్ కాలేజీ జాతీయస్థాయిలో 84వ స్థానంలో ఉందన్నారు.





స్నాతకోత్సవంలో మాట్లాడుతున్న గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, ఐఐసీటీ డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి, వీసీ ప్రతాప్‌రెడ్డి

ఈ విజయాలు పరిమిత వనరుల మధ్య విద్యార్థులు, అధ్యాపకులు, పరిశోధకులు కృషికి ఫలితమన్నారు. డీఎస్టీ, సీఎస్ఐఆర్, ఐసీఎంఆర్, యూజీసీ, ఐసీఎస్ఆర్ ఏజెన్సీల మద్దతు కూడా గుర్తుచేశారు. మీ స్వప్నాల వేటకు ఇది మేల్కొనే క్షణమన్నారు. మీరు కేవలం డిగ్రీలు పొందలేదని ఒక బాధ్యత, ఆశయాన్ని దేశాభివృద్ధిలో భాగస్వామిగా మారే అవకాశాన్ని స్వీకరించారన్నారు. కాకతీయ యూనివర్సిటీ 23వ స్నాతకోత్సవం విద్య, వికాసం, ఆశ, నూతన ఆరంభాలకు ప్రతీకగా నిలిచిందన్నారు. కెరీర్‌లోనే కాకుండా భవిష్యత్‌లో ఇంకా ఎదగాలని ఆకాంక్షించారు. ప్రారంభంలో పీహెచ్‌డీ పట్టభద్రులకు, గోల్డ్‌మెడల్స్ సాధించిన వారికి గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ అభినందనలు తెలిపారు.

మీడియం అవరోధం కాదు.. ప్రశ్నలడగడం నేర్చుకోవాలి

కాకతీయ విశ్వవిద్యాలయం 23వ స్నాతకోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన ఐఐసీటీ డైరెక్టర్ డాక్టర్ డి.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ సమాజ నిర్మాణానికి విద్యార్థుల శక్తిని ఉపయోగించాలన్నారు. భాషామాధ్యమం మన అభివృద్ధికి అవరోధం కాదని, విజేతలుగా విద్యార్థులు నిలవడంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, స్నేహితుల పాత్ర ను గుర్తుచేస్తూ విద్యార్థుల విజయం వెనుక తల్లిదండ్రులు, గురువుల పాత్ర కూడా ఉందన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డి తన సొంత జీవన ప్రయాణాన్ని పంచుకున్నారు. తనది నల్లగొండలో చిన్న గ్రామమన్నారు. తెలుగు మీడియంలో డిగ్రీ వరకు విద్యనభ్యసించి ఇంగ్లిష్‌తో పోరాడుతూ పేపర్ బాయ్‌గా పని చేసిన అనుభవాలను వివరించారు. తాను ఐఐసీటీ డైరెక్టర్‌గా ఎదిగిన విషయాన్ని ప్రస్తావించారు. ప్రతి విద్యార్థికి 'మీ గతం కాదు, మీ లక్ష్యానికి మీరు చేసే ప్రయాణమే అసలైన నిర్వచనం' అని సందేశమిచ్చారు.

కేయూ అభివృద్ధి పనులకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు..

కేయూ వీసీ కె. ప్రతాప్‌రెడ్డి.. యూనివర్సిటీ విద్యాపరంగా, పరిశోధనపరంగా, అభివృద్ధి పరంగా ఎదుగుతున్న తీరు రిపోర్టు రూపంలో అందించారు. కేయూ న్యాక్ ఏ ప్లస్ గ్రేడ్ కలిగి ఉండి 50 సంవత్సరాలు పూర్తిచేసుకోబోతోందని, గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలు కూడా నిర్వహించుకోబోతున్నట్లు వెల్లడించారు. అభివృద్ధి పనులకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు కూడా తెలిపారు. స్నాతకోత్సవంలో రిజిస్ట్రార్ వి. రామచంద్రం, డీన్లు గాదె సమ్మయ్య, బి.సురేశ్‌లాల్,జి. హనుమంతు, శ్రీనివాస్, సదానందం, కేయూ పరీక్షల నియంత్రణాధికారి కె. రాజేందర్, సెనెట్ సభ్యులు, మాజీ వీసీలు ఎన్. లింగమూర్తి, బి.వెంకటరత్నం, అంపశయ్య నవీన్, కేయూ పాలకమండలి సభ్యులు మల్లం నవీన్, సుకుమారి, అనితారెడ్డి, బాలు చౌహాన్, సుదర్శన్, రమ, చిర్రరాజు, తదితరులు పాల్గొన్నారు. పీహెచ్‌డీ అవార్డులు పొందని అభ్యర్థులకు డాక్టరేట్ పట్టాలు, వివిధ కోర్సుల్లో గోల్డ్‌మెడల్స్‌సాధించిన అభ్యర్థులకు గోల్డ్‌మెడల్స్‌ను రాష్ట్రగవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ.. శ్రీనివాస్‌రెడ్డి, వీసీ ప్రతాప్‌రెడ్డితో కలిసి ప్రదానం చేశారు.

గవర్నర్‌కు చేనేత జ్ఞాపిక అందజేత



న్యూశాయంపేట: వరంగల్ పర్యటనలో భాగంగా హనుమకొండ కలెక్టర్‌లో సోమవారం టీబీపై జరిగిన సమావేశానికి రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ హాజరయ్యారు. ఓరుగల్లు ప్రత్యేకత గుర్తుండేలా జీఐ ట్యాగ్ పొందిన చపాట మిర్చి, కాకతీయ కళాతోరణం ప్రతిబింబించిన వరంగల్ చేనేత దర్రీ జ్ఞాపికను కలెక్టర్ సత్యశారద.. గవర్నర్‌కు అందజేశారు.



అభ్యర్థినికి పీహెచ్‌డీ పట్టా అందజేస్తున్న గవర్నర్, వీసీ



గవర్నర్ చేతుల మీదుగా పట్టాలు పొందుతున్న అభ్యర్థులు



అభ్యర్థినులకు గోల్డ్‌మెడల్స్ ప్రదానం చేస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, ఐఐసీటీ డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి, వీసీ ప్రతాప్‌రెడ్డి





గోల్డ్‌మెడల్స్ అందుకున్న అభ్యర్థినులతో గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, ఐఐసీటీ డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి, వీసీ ప్రతాప్‌రెడ్డి




గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ చేతుల మీదుగా పట్టాలు అందుకుంటున్న అభ్యర్థులు



గవర్నర్ చేతుల మీదుగా గోల్డ్‌మెడల్స్ అందుకుంటున్న అభ్యర్థులు



కేయూ పాలకమండలి సభ్యులు, డీన్లు, సెనెట్ సభ్యులతో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ఐఐసీటీ డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి , వీసీ ప్రతాప్‌రెడ్డి

నేడు మానుకోటకు ఉప ముఖ్యమంత్రి, ఐదుగురు మంత్రుల రాక

- మహబూబాబాద్, కేసముద్రంలో రూ. 500 కోట్ల పనులకు శంకుస్థాపన

సాక్షి, మహబూబాబాద్: పలు అభివృద్ధి పనుల శంకుస్థాపనల నిమిత్తం మంగళవారం ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్కతోపాటు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క, దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ.. మహబూబాబాద్ జిల్లాలో పర్యటించనున్నారు. హెలికాప్టర్‌లో ఉదయం 12 గంటలకు మహబూబాబాద్ రూరల్ మండలం సోమ్లా తండాకు చేరుకుంటారు. అక్కడ రూ. 100కోట్లతో చేపట్టనున్న రోడ్లు, సబ్ స్టేషన్లు, సెంట్రల్ డ్రగ్స్ స్టోర్స్ పనులకు శంకుస్థాపన చేస్తారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు రూ. 1.20కోట్ల విలువైన చెక్కులు అందజేస్తారు. అనంతరం బహిరంగ సభలో ప్రసంగిస్తారు. అక్కడి నుంచి కేసముద్రం మున్సిపాలిటీకి చేరుకుని అక్కడ రూ. 300 కోట్లతో చేపట్టనున్న డిగ్రీ కళాశాల భవనం, హౌసింగ్ గోదాంలు, కల్వలలో 1322/11 కేవీ సబ్‌స్టేషన్, మట్టివాడ, ఉప్పరపల్లి, కేసముద్రంలో నిర్మించనున్న 32/11 కేవీ సబ్ స్టేషన్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేస్తారు. ఈ పర్యటనలో డిప్యూటీ స్పీకర్ రాంచంద్రునాయక్, ఎంపీ బలరాం నాయక్, ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య తదితరులు పాల్గొంటారని మహబూబాద్ ఎమ్మెల్యే మురళీనాయక్ సోమవారం తెలిపారు.

గుండెపోటుతో ఈజీఎస్ ఏపీఓ శ్రీనివాస్ మృతి



శ్రీనివాస్‌గౌడ్ (ఫైల్)

పాలకుర్తి టౌన్ : జనగామ జిల్లా పాలకుర్తి మండల కేంద్రానికి చెందిన ఈజీఎస్ ఏపీఓ కమ్మగాని శ్రీనివాస్‌గౌడ్(50)గుండెపోటుతో మృతి చెందారు. సోమవారం ఉదయం మండల కేంద్రంలోని జనగామ రోడ్డులో వాకింగ్‌కు వెళ్లిన శ్రీనివాస్.. గుండెపోటుతో ఒక్కసారిగా కుప్పకూలారు. స్థానికులు గమనించి వెంటనే స్థానిక ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కాగా, శ్రీనివాస్ దేవరుప్పుల మండలంలో ఈజీఎస్ ఏపీఓగా విధులు నిర్వర్తిస్తున్నారు. డీఆర్‌డీఓ పీడీ వసంత, అడిషనల్ డీఆర్‌డీఓ పీడీ చంద్రశేఖర్.. శ్రీనివాస్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

రేవంత్ అసమర్థ పాలనే కారణం..

సీఎం రేవంత్‌రెడ్డి అసమర్థ పాలన శ్రీనివాస్‌ను హత్య చేసిందని ఏపీఓల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మోహన్‌రావు అన్నారు. దేవరుప్పుల మండలంలో ఏపీఓగా విధులు నిర్వర్తిస్తున్న కమ్మగాని శ్రీనివాస్‌గౌడ్ మూడు నెలలుగా జీతాలు రాకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. దీంతో మనస్తాపంతో గుండెపోటుకు గురై మృతి చెందారన్నారు. కాగా, ఈజీఎస్ ఏపీఓల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని డీఆర్‌డీఓ పీడీ వసంత హామీ ఇచ్చారు. ఈజీఎస్ కంప్యూటర్ ఆపరేటర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కుమార్, టెక్నికల్ అసిస్టెంట్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకటరామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఇది ముమ్మాటికీ ప్రభుత్వ హత్యే..

దేవరుప్పుల : మూడు నెలలు గడిచినా వేతనాలు ఇవ్వకపోవడంతో ఉపాధి హామీ ఏపీఓ కమ్మగాని శ్రీనివాస్ మనోవేదనతో గుండెపోటుకు గురై మృతి చెందారని, ఇది ముమ్మాటికీ కాంగ్రెస్ ప్రభుత్వ హత్యే అని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. ఈ మేరకు సోమవారం శ్రీనివాస్ కుటుంబీకులను ఫోన్‌లో పరామర్శించి ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. నిత్యం కూలీల సంక్షేమం కోసం కృషి చేసే ఉపాధి హామీ పథక ఉద్యోగులకు రెగ్యులర్ వేతనాలు ఇవ్వకపోవడం రేవంత్‌రెడ్డి సర్కారు ఆర్థిక దుస్థితికి నిదర్శనమన్నారు.

ప్రైవేట్ పాఠశాల బస్సు అడ్డగింత..

గ్రామస్తులతో కలిసి బస్సును అడ్డుకున్న టీచర్లు



ప్రైవేట్ పాఠశాల బస్సును అడ్డుకుంటున్న గ్రామస్తులు, ఉపాధ్యాయులు

దోర్నకల్: మండలంలోని తెల్లబండతండాలో సోమవారం ప్రైవేట్ పాఠశాల బస్సును గ్రామస్తులతోపాటు ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు అడ్డుకున్నారు. చిలుకోడుకు చెందిన ప్రైవేట్ పాఠశాల యాజమాన్యం.. ప్రభుత్వ పాఠశాలలపై దుష్ప్రచారం చేస్తూ విద్యార్థుల సంఖ్య పెంచుకుంటున్నారని మండిపడ్డారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు మాయమాటలు చెప్పి ప్రైవేట్‌లో చేర్పించుకుంటున్నారని సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. చిలుకోడు ఎంపీపీఎస్ ఉపాధ్యాయులు తలారి విద్యాసాగర్, రాములు, తెల్లబండతండా ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు సునీత, శంకర్ తదితరులు గ్రామస్తులతో కలిసి ప్రైవేట్ బస్సును అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు విద్యాసాగర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య లభిస్తుందన్నారు. దీనిపై తల్లిదండ్రులు స్పందించి తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు.

కాజీపేటలో రైల్వే ఇన్‌చార్జ్ జీఎం తనిఖీ

- అమృత్ భారత్ పనుల పరిశీలన



లోకోపైలెట్ల డ్యూటీ రోస్టర్‌ను పరిశీలిస్తున్న ఇన్‌చార్జ్ జీఎం సందీప్‌మాథుర్

కాజీపేట రూరల్ : కాజీపేట జంక్షన్‌లో సోమవారం దక్షిణ మధ్య రైల్వే ఇన్‌చార్జ్ జనరల్ మేనేజర్ సందీప్‌మాథూర్ తనిఖీ చేపట్టారు. ఇటీవల అదనపు జీఎంగా బాధ్యతలు స్వీకరించిన సందీప్ మాథూర్.. మొదటి సారి ప్రత్యేక రైలులో బెల్లంపల్లి, మంచిర్యాల, రామగుండం, పెద్దపల్లిలో తనిఖీలు చేసుకుంటూ కాజీపేట జంక్షన్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా డీఆర్ఎం భర్తీష్‌కుమార్ జైన్‌తో కలిసి కాజీపేట రైల్వే స్టేషన్ అమృత్ భారత్ అభివృద్ధి పనులు, ప్రయాణికుల వెయిటింగ్ హాల్, టాయ్‌లెట్స్‌ను తనిఖీ చేసి నిర్వహణలో లోపాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫుట్‌ఓవర్‌బ్రిడ్జి, ఎస్కలేటర్, లిఫ్ట్ నిర్మాణ పనులను పరిశీలించి వేగవంతం చేయాలని ఆదేశించారు. లోకోపైలెట్ కార్యాలయం, రూట్‌రిలే ఇంటర్‌లాకింగ్ కార్యాలయంలోకి వెళ్లి సిగ్నల్ రిలేలను తనిఖీ చేశారు. తనిఖీల్లో సికింద్రాబాద్ సీనియర్ డీఓఎం సురేశ్‌రెడ్డి, సీనియర్ డీసీఎం సిఫాలి, సీపీటీఎం ఎలివేందర్ యాదవ్, డీఓఎం జనరల్ సుధీర్, సీనియర్ డీఎస్‌టీఈ ప్రియ అగర్వాల్, డీఈఎన్ సెంట్రల్ ప్రంజల్ కేశర్‌వాణి, ఏసీఎం ఐఎస్ఆర్ మూర్తి, కాజీపేట స్టేషన్‌మేనేజర్ అగ్గి రవీందర్, కాజీపేట సీనియర్ డీఎంఈ డీజిల్ వెంకటకుమార్, సీనియర్ డీఈఈ ఈఎల్ఎస్ సూర్యనారాయణ, ఏడీఈఎన్ సంతోశ్‌కుమార్, ఎస్ఎస్ఈ రాజన్న, ఆర్పీఎఫ్ సీఐ చటర్జీ , జీఆర్పీ సీఐ నరేశ్‌కుమార్ ఉన్నారు. కాగా, ఇన్‌చార్జ్ జీఎంకు కాజీపేట రైల్వే మజ్దూర్ యూనియన్ డీజిల్ బ్రాంచీ కార్యవర్గ సభ్యులు పి.వేదప్రకాశ్, ఎస్.కె.జానీమియా, జి.రాజేశ్వర్, ఎ.సత్యనారాయణ, నరేశ్‌యాదవ్, నాగరాజు, తిరుపతి యాదగిరి.. డీజిల్ కాలనీలో మంచినీటి సమస్య, క్వార్టర్స్‌లో విద్యుత్ సప్లయ్, కార్మికుల సమస్యలపై వినతి పత్రం అందజేశారు. అదేవిధంగా కాజీపేట మజ్దూర్ యూనియన్ ఆల్ బ్రాంచీస్ కోఆర్డినేటర్ నాయిని సదానందం, టెక్నికల్ బ్రాంచ్ సెక్రటరీ ఆర్.సమ్మయ్య ఆధ్వర్యంలో కార్మికుల సమస్యలపై ఇన్‌చార్జ్ జీఎం సందీప్‌మాథూరుకు వినతి పత్రం అందజేశారు.

ప్రాణహిత పరవళ్లు..

- కాళేశ్వరం వద్ద పెరిగిన నది ప్రవాహం
- అన్నారం బ్యారేజీ వద్ద గోదావరి వెలవెల..



సరస్వతీఘాట్ వద్ద మెట్లను తాకుతూ ప్రవహిస్తున్న ప్రాణహిత

కాళేశ్వరం: మహారాష్ట్రలో కురుస్తున్న వర్షాలతో కాళేశ్వరం వద్ద గోదావరితో కలిసి ప్రాణహిత నది వరద పరవళ్లు తొక్కుతోంది. సోమవారం సాయంత్రం నుంచి వరద ప్రవాహం పెరగడంతో మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని త్రివేణి సంగమం సరస్వతీఘాట్ వద్ద నూతనంగా నిర్మించిన మెట్లను తాకుతూ 6 మీటర్ల ఎత్తులో దిగువకు కాళేశ్వరం మీదుగా తరలుతోంది. దీంతో కాళేశ్వరం ప్రాజెక్టు పరిధి మేడిగడ్డ(లక్ష్మి) బ్యారేజీలో 70వేల క్యూసెక్కుల వరద చేరింది. బ్యారేజీలోని మొత్తం 85 గేట్లు ఎత్తివేసి వచ్చిన నీటిని వచ్చినట్లు విడుదల చేస్తున్నారు.

గోదావరి వెలవెల..

ఓ వైపు మహారాష్ట్రలో ఎగువన కురుస్తున్న వర్షాలతో ప్రాణహితకు వరద ఉధృతి పెరిగింది. అయితే తెలంగాణలో వర్షాభావ పరిస్థితులతో మహదేవపూర్ మండలంలో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు పరిధి అన్నారం(సరస్వతి)బ్యారేజీ వద్ద ఇసుక దిబ్బలు దర్శనమిస్తున్నాయి. దీంతో గోదావరి వరద నీరు లేక వెలవెలబోతోంది. ఒకే మండల పరిధిలో ఎనిమిది కిలోమీటర్ల తేడాలో ఇలాంటి విభిన్న దృశ్యాలు కనిపిస్తుండడంతో రైతులు ఆకాశం వైపు ఆశగా ఎదురు చూస్తున్నారు. రాష్ట్రంలో జూన్ ముగిసి, జూలై వచ్చినా సరైన వర్షపాతం నమోదు కాకపోవడంతో ఆందోళన చెందుతున్నారు.



అన్నారం బ్యారేజీ వద్ద నీరు లేక ఇసుక దిబ్బలతో దర్శనమిస్తున్న గోదావరి